క్లుప్తంగా

15 వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించండి


గ్రామ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఈవోఆర్‌డీ చంద్రశేఖర్

పాయకరావుపేట : గ్రామాల్లో 15 వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించి అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లకు ఈవోఆర్‌డీ సిహెచ్ చంద్రశేఖర్ ఆదేశాలు జారీ చేసారు. గ్రామాల్లో ఆరోగ్య శ్రీ, అయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేసిన వారికి వలంటీర్లు ఈకెవైసీ తీసుకోవాలని ఆదేశించడం జరిగిందన్నారు. నెట్ కేప్ పెండింగ్ బిల్లులు పరిష్కరించాలని ఆయన కోరారు. అదే విధంగా గ్రామాల్లో కార్యదర్శులు పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచనలు అందించినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా గ్రామ సచివాలయాల్లో పెండింగ్ పనులు లేకుండా ఎప్పటికప్పుడు ప్రజలకు సమస్యలు పరిష్కరించాలని ఈవోఆర్‌డీ చంద్రశేఖర్ తెలిపారు.

రీ-సర్వేలో తేడాలను సవరించుకోవాలి


పంచాయతీ కార్యాలయంలో రైతులకు వివరిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రీ-సర్వేలో లోపాలను సవరించుకోవాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం రీ-సర్వే లోపాలను సవరించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి రైతు తమ పట్టాదారు పుస్తకాలను పరిశీలించుకోవాలని ఎక్కడైనా భూమి విస్తీర్ణాలకు సంబంధించి తేడాలుంటే వాటిని వేగవంతంగా సవరించుకోవాలన్నారు. ఇటువంటి సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు,వీఆర్వో హిమబిందు కార్యక్రమంలో పాల్గొన్నారు.

316 మంది రోగులకు వైద్య సేవలు


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పాయకరావుపేట : గజపతినగరం గ్రామంలో 316 మంది రోగులకు వైద్యులు వైద్య సేవలు అందించారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడతలో భాగంగా మండలంలో గల గజపతినగరంలో శ్రీరాంపురం పిహెచ్‌సి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వైద్యులు డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ రవికిరణ్, డాక్టర్ పి.కావ్య రోగులకు బీపీ, షుగర్, గుండెకు సంబంధించిన పరీక్షలు, రక్త పరీక్షలు, కంటి పరీక్షలు ఉచితంగా మందులు పంపిణీ చేసి, తగు సూచనలు, సలహా లు అందించారు. స్త్రీలకు ప్రత్యేక వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.కావ్య, ఎంపిహెచ్ఈవో బాలాజీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన ఎల్ అండ్ టీ కార్మికుల ఆందోళన


తమ డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేస్తున్న కార్మికులు

రాంబిల్లి : తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ నేవీ నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ కార్మికులు ఆందోళన మంగళవారం కొనసాగింది. ఈ ఆందోళన సోమవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. కాగా కార్మికుల ఆందోళన నేపథ్యంలో కార్మిక నాయకులతో విశాఖపట్నంలో లేబర్ కమిషనర్ మెహంతి చర్చలు జరిపారు. సీఐలు లక్ష్మణరావు, దీనబంధు పలువురు అధికారులు ఈ చర్చల్లో పాల్గొన్నారు. కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తామని కార్మికుల సమస్యలను ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించినట్లు సీఐటీయూ జిల్లా నాయకులు శంకర్రావు, దేముడునాయుడు తెలిపారు. దీంతో కార్మికులు ఆందోళన విరమిస్తున్నట్లు పేర్కొన్నారు.

సురక్షతో ఆరోగ్య భరోసా


రాజుపేటలో ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభిస్తున్న సర్పంచ్‌లు ముసిలినాయుడు,దేముళ్లు


షేకిళ్లపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో అప్పలనాయుడు

మునగపాక : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భరోసా కలుగుతుందని రాజుపేట,కాకరాపల్లి సర్పంచ్‌లు కిలాడి దేముళ్లు, కొల్లి ముసిలినాయుడులు తెలిపారు. మంగళవారం మండలంలోని రాజుపేట సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని వారు ప్రారంభించారు. 140 రకాలకు పైగా మందులు అందుబాటులో ఉంటాయని, ఇటువంటి శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎంపీడీవో ఎం.మన్మథరావు,వైద్యాధికారి శ్రీవల్లి కార్యక్రమంలో పాల్గొన్నారు.

యలమంచిలి : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రజల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని యలమంచిలి ఎంపీడీవో కె.అప్పలనాయుడు అన్నారు.ఆయన మంగళవారం యలమంచిలి మండలం షేకిళ్లపాలెం గ్రామ సచివాలయం వద్ద జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంను సందర్శించి వైద్య శిభిరంలో రోగులకు అందుతున్న సేవలను గూర్చి వైద్యులను, ప్రజలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఫేజ్-2లో భాగంగా ప్రతి గ్రామంలో రెండోసారి ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు మరలా ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు ఉచితంగా ప్రభుత్వం సరఫరా చేస్తుందని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులకు పెద్దాసుపత్రులకు రిఫర్ చేసి వారి ఆరోగ్య పరమైన సమస్యలను ఆరోగ్యయాప్ ద్వారా వివరాలు నమోదు చేయించుకొని సచివాలయ వైద్య సిబ్బంది ద్వారా వారిని పర్యవేక్షించి కావలసిన విధంగా వైద్య సమాచారం అందించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరానికి తురంగలపాలెం,జంపపాలెం గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


కొడవటిపూడిలో రోగికి కంటి పరీక్ష చేస్తున్న వైద్యురాలు

కొడవటిపూడిలో ఆరోగ్య సురక్ష

కోటవురట్ల : ప్రతి కుటుంబానికి ఆరోగ్యరక్ష కల్పించడమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని సర్పంచ్ కోసూరు అప్పారావు అన్నారు. కొడవటిపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రత్యేక వైద్య నిపుణులు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రోగుల చెంతకే వైద్య సేవలను అందించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి ప్రతి ఒక్కరి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, మాజీ సర్పంచ్ బాలేపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజాసేవ చేసే వలంటీర్లందరూ వజ్రాలే

- ఏటికొప్పాకలో వలంటీర్లకు సత్కారం

యలమంచిలి రూరల్ : ప్రజాసేవ చేస్తున్న వలంటీర్లందరూ వజ్రాలేనని యలమంచిలి జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి అన్నారు. మంగళవారం ఏటికొప్పాక గ్రామ సచివాలయంలో గ్రామానికి చెందిన 38మంది వలంటీర్లకు సన్మాన కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ సంధ్యారాణి మాట్లాడుతూ వజ్ర అవార్డులు అందరికీ రాకపోయినా సీఎం వై.ఎస్.జగన్ వలంటీర్లందరినీ వజ్రాల కంటే ఎక్కువగా గుర్తించి, గౌరవించారని అన్నారు.వలంటీర్లపై జగనన్న ఎంతో నమ్మకం పెట్టుకున్నారో, చక్కటి ప్రజాసేవ చేస్తూ దానిని నిలబెట్టుకోవాలని కోరారు. ప్రజల మన్ననలు పొందుతూ నాయకులతో మమేకమై పనిచేయాలన్నారు. వలంటీర్లు చేసిన సాయాన్ని లబ్ధి పొందిన ప్రజలు ఏ మాత్రం మరిచిపోరని, జీవితకాలం గుర్తుంచుకుంటారన్నారు. అనంతరం సేవామిత్ర అవార్డులు పొందిన వలంటీర్లను ప్రత్యేకంగా సత్కరించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సేనాపతి రాము, ప్రతాప్‌బాబు మాట్లాడుతూ పరిపాలనకు మూలస్తంభాలుగా ఉన్న వలంటీర్ల సేవలు నిస్వార్థమైనవన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలను అందించేందుకు వలంటీర్లు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. నిస్వార్థ సేవలకు ప్రతిరూపంగా వీరు పని చేస్తున్నారన్నారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వ సేవలను పటిష్టంగా అమలు చేస్తున్న వలంటీర్ల సేవలను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం ఏటా పురస్కారాలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కర్ణ రవి, పార్టీ నాయకులు బంగారుబాబు, ఉన్నత పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ దేవరపల్లి రమణ, ప్రాథమిక పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ మల్లేటి ప్రసాద్, సత్యనారాయణ, పంచదార్ల బాపూజీ, అన్నం వెంకినాయుడు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, గ్రామ పెద్దలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఏటికొప్పాకలో వలంటీర్లను సత్కరిస్తున్న గ్రామపెద్దలు

బాలికలు చదువులో రాణించాలి


కేజీబీవీలో విద్యార్థినుల అభ్యాసాన్ని పరీక్షిస్తున్న జీసీడీవో పద్మావతి

కోటవురట్ల: బాలికల విద్య, ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పద్మావతి సూచించారు. స్థానిక కేజీబీవీలో ఆమె సోమవారం రాత్రి బస చేశారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. మంగళవారం పరిసరాలు, డార్మెటరీ, స్టోర్ రూమ్, టాయిలెట్స్ పరిశీలించారు. పంచతంత్ర ప్రణాళికను పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. స్టడీ అవర్స్‌లో విద్యార్థులను పలు సబ్జెక్టులలో ప్రశ్నలు వేశారు. ఆమె మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థినులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకుంటూనే ఉత్తమ ఫలితాలకు సాధన చేయాలన్నారు. వెనకబడిన విద్యార్థినుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్‌వో సరితాదేవికి సూచించారు. ప్రతి రోజూ క్రమం తప్పకుండా స్టడీ అవర్స్ నిర్వహించాలని, అనారోగ్య సమస్యలతో బాధపడేవారి పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం

ఎస్.రాయవరం : పాఠశాలలో పని చేసి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు మరలా పాఠశాలకు అవసరమైన సేవలందించడం అభినందనీయమని గుడివాడ సర్పంచ్ ధూళి శ్రీనుబాబు అన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎం.కొండలరావు సమకూర్చిన స్థానిక పాఠశాలకు రూ.15 వేలు విలువ చేసే ప్రింటర్‌ను సర్పంచ్ చేతుల మీదుగా బహూకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను రూపురేఖలు మార్చే విధంగా ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయిస్తుందని , ఈ అభివృద్ధి పనులకు స్థానిక దాతల సహకారం మరింత తోడ్పాటునిస్తుందన్నారు. ఈ సదుపాయాలు ఉపయోగించుకుని విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగన్నదొర, ఉపాధ్యాయులు కుందూరు రాజు, సుధాలక్ష్మి, సుబ్బలక్ష్మి, భవాని, అనిత తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలకు ప్రింటర్ అందజేస్తున్న సర్పంచ్ శ్రీనుబాబు

ఉపాధి పథకంలో ఉద్యాన పంటల సాగు

మునగపాక : ఉపాధిహామీ పథకం ద్వారా ఉద్యానవన పంటల సాగు కూడా చేపట్టవచ్చని డుమా పీడీ ఇ.సందీప్ తెలిపారు. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మునగపాక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా అంతర పంటల సాగు కూడా చేపట్టవచ్చన్నారు. ప్రస్తుతం చెరకు ద్వారా ఆశించిన ఆదాయం రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అయితే వారిని ప్రోత్సహించేందుకు అంతర పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రహదారులు, చెరువులు, కాలువల అభివృద్ధికి ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు ఆయా గ్రామాల్లో జరిగే పనులను ఎప్పటికపుడు పర్యవేక్షించాలన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ బొజా లక్ష్మీ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, తహసీల్దార్ పాపారావు, ఎంపీడీవో మన్మథరావు, ఏపీవో ఎరకయ్య, పలువురు ప్రజా ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డ్వామా పీడీ సందీప్

ఆసరా సాయం అందలేదని ఫిర్యాదు

రాంబిల్లి: తన భార్య ఎస్. మహాలక్ష్మి డ్వాక్రా సంఘ సభ్యురాలుగా ఉందని అయితే తనకు రావాల్సిన పొదుపు సొమ్ము, ప్రభుత్వం అందించిన వైఎస్సార్ ఆసరా సాయం అందలేదని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరెడ్డి వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఏపీఎం పద్మకు ఫిర్యాదు చేశారు. దీనిపై సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దిమిలి గ్రామానికి చెందిన కనక మహాలక్ష్మి గ్రూపులో తన భార్య సభ్యురాలుగా ఉందని ఈ గ్రామంలో డ్వాక్రా సిబ్బంది తీరు సక్రమంగా లేదని తెలిపారు.


ఏపీవో పద్మకు ఫిర్యాదు చేస్తున్న వెంకటరమణ

డీవైఈవో ఆకస్మిక తనిఖీ


బోదిగల్లం పాఠశాలలో తనిఖీ చేస్తున్న డీవైఈవో అప్పారావు

నక్కపల్లి : స్థానిక బాలికోన్నత పాఠశాలను యలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి సంసిద్ధతా పరీక్షలను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులకు మెరుగైన ఫలితాలు సాధన కోసం ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. పబ్లిక్ పరీక్షలు సమయం దగ్గర పడుతున్న తరుణంలో విద్యార్థుల్లో భయం పోగొట్టాలన్నారు.ఫార్మేటివ్ పరీక్ష సమాధాన పత్రాలను, నోట్స్‌లను పరిశీలించారు.

లిప్ టీమ్ పరిశీలన : స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను మండల స్థాయి లిప్ బృందం మంగళవారం పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిలను పరిశీలించారు. బోధన, సాధనా పీరియడ్స్‌ను పరిశీలించారు. వీరి వెంట మండల విద్యాశాఖాధికారి కె.నరేష్, దేవవరం, పెదరామభద్రపురం, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వి.నూకరాజు, కోడి శ్రీనివాసరావు,హెచ్ఎం అసోసియేషన్ ప్రతినిధి శాస్త్రి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌ల దుర్వినియోగం తగదు

- అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి
- విద్యార్థులకు పరవాడ డీఎస్పీ సత్యనారాయణ హితవు

యలమంచిలి : విద్యార్థికి బాల్యదశ ఎంతో కీలకమైనదని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. యలమంచిలి మున్సిపాలిటీలో రైల్వేస్టేషన్ రోడ్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు భద్రత పరమైన సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలని, సెల్‌ఫోన్‌లను విజ్ఞానానికి, కమ్యూనికేషన్‌కు మాత్రమే వినియోగించాలని, చెడు నడవడికలకు దూరంగా ఉండాలని దురలవాట్లకు లోనుకాకుండా చదువుపై ఏకాగ్రత పెంపొందించుకోవాలని సూచించారు. నేరచరితులుగా మారకుండా మంచి ఉన్నతమైన స్థానాల్లో ఉండేలా ప్రణాళికలు రుచించుకోవాలని సూచించారు.

వైభవంగా పాదాలతల్లి పండగ

మునగపాక : మండలంలోని చెర్లోపాలెంలో మంగళవారం పాదాలతల్లి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారీగా తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా అమ్మవారి పండగలు

అచ్యుతాపురం: అచ్యుతాపురం మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం అమ్మవారి పండగలు ఘనంగా జరిగాయి.నడింపల్లిలో పైడిమాంబ అమ్మవారి పండుగ సందర్భంగా భక్తులు భారీగా తరలివెళ్లారు. అదే విధంగా పూడి వైఎస్సార్‌నగర్ అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. పలు గ్రామాల్లో అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు.

రేపు తోటాడలో మరిడిమాంబ పండగ

మునగపాక : మండలంలోని తోటాడలో ఈ నెల 29న మరిడిమాంబ పండగను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అదే రోజు రాత్రి గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

రాంబిల్లి : పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్. వెంకటేష్ అన్నారు. దిమిలి పీహెచ్‌సీలో మంగళవారం ఆయన మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంపై వైద్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 1419 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాల్సి ఉందన్నారు. శతశాతం పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. పోలియో చుక్కల ప్రాధాన్యతను వివరించారు. ఎంపీహెచ్ఈవో రాజు మాట్లాడుతూ, పోలియో రహిత సమాజం కోసం అందరూ పనిచేయాలన్నారు. పల్స్ పోలియోపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ధనరాజు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- పరవాడ డీఎస్పీ సత్యనారాయణ
- లైనుకొత్తూరు గ్రామంలో ఎన్నికల నియమావళిపై ప్రజలకు అవగాహన కార్యక్రమం

యలమంచిలి : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలందరూ సహకరించాలని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ కోరారు. యలమంచిలి మండలం లైనుకొత్తూరు గ్రామంలో మంగళవారం ప్రజాప్రతినిధులు, ప్రజలకు ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికల నియమావళిని అనుసరించి నడుచుకోవాలని కోరారు. అక్రమంగా మద్యం, నగదు తరలించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి సీఐ షేక్ గఫూర్, ఎస్ఐ పాపినాయుడు గ్రామ పెద్దల, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

త్వరితగతిన అణుకు రోడ్డు పనులు


అణుకు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ఉదయశ్రీ, అధికారులు

కోటవురట్ల: అణుకు రోడ్డు నిర్మాణ పనులను మండల ప్రత్యేకాధికారిణి ఉదయశ్రీ మంగళవారం పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణాన్ని పూర్తి చేసి వాడుకలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఆమె మాట్లాడుతూ గతంలో అణుకు గిరిజనులు రహదారి నిర్మాణం కోసం పోరాటం చేయగా స్పందించిన జిల్లా కలెక్టర్ తాత్కాలికంగా గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి రూ.32 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. మెయిన్‌రోడ్డు నుంచి అణుకు గ్రామానికి 4.70 కిలోమీటర్లు కాగా ప్రస్తుతానికి 3 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం పూర్తయినట్టు తెలిపారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే గిరిజనుల ఇబ్బందులు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, మండల జేఈ వర్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు రమేష్, మాజీ సర్పంచ్ టి.నారాయణరావు పాల్గొన్నారు.

ఆర్డీవోకు పెదకలవలాపల్లి వాసుల వినతి

రాంబిల్లి: నేవీ ప్రహరీ నిర్మాణంతో తమ జీవనోపాధికి ఇబ్బందులు కలుగుతాయని తమకు న్యాయం చేయాలని పెదకలవలాపల్లి గ్రామస్తులు ఆర్డీవో చిన్నికృష్ణకు మొర పెట్టుకున్నారు. మంగళవారం ఆర్డీవో పెదకలవలాపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ గ్రామానికి చెందిన కొందరు కొన్ని రోజులుగా ధర్నా నిర్వహిస్తున్నారు. దీంతో ఆర్డీవో ఇక్కడకు వచ్చారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మేకలు, గొర్రెలు, పశువులను కొండప్రాంతంలో మేపుకొంటూ జీవనం సాగించేవారమని ఇపుడు ప్రహరీ నిర్మిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలను తీసుకువెళతానని ఆర్డీవో పేర్కొన్నారు. ఇదిలావుండగా తమ పొలాల్లోకి వెళ్లేందుకు దారి వుండేలా ప్రహరీ నిర్మించాలని చినకలవలాపల్లి గ్రామస్తులు ఆర్డీవోను కోరారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

8 పోలింగ్ కేంద్రాల పేర్ల సవరణ

- పారదర్శకమైన ఓటర్ల జాబితాకు సహకరించండి
- రాజకీయపార్టీల నాయకులతో ఈఆర్వో మనోరమ


వివిధ రాజకీయపార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఈఆర్వో మనోరమ

యలమంచిలి రూరల్ : నియోజకవర్గంలో 8 పోలింగ్ కేంద్రాల పేర్లలో పాక్షికంగా సవరణ చేస్తున్నట్టు యలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిటర్నింగ్ అధికారి కె.మనోరమ తెలిపారు. మంగళవారం యలమంచిలి తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయపార్టీల నాయకులతో జరిగిన సమావేశంలో ఆమె ఈ మేరకు ఏఏ పోలింగ్ కేంద్రాల పేర్ల సవరణ చేపట్టబోయేది వారికి తెలియజేశారు.యలమంచిలి మండలంలో రెండు,రాంబిల్లి మండలంలో రెండు, అచ్యుతాపురంలో నాలుగు పోలింగ్ కేంద్రాల పేర్లలో స్వల్ప మార్పులు చేపడుతున్నామని,వాటి వివరాలను సమావేశానికి హాజరైన రాజకీయపార్టీల నాయకులకు వివరించారు. యలమంచిలి మండలంలో ఏటికొప్పాకలో 102, 110 పోలింగ్ కేంద్రాలు,రాంబిల్లిలో అప్పన్నపాలెం,కొండవారిపాలెం, అచ్యుతాపురంలో దిబ్బపాలెం, ఎస్ఈజెడ్ కాలనీ,చిప్పాడ,ఉద్దపాలెం పోలింగ్ కేంద్రాల పేర్లు సవరణ చేయడానికి ఉన్నతాధికారులకు పంపించనున్నట్టు ఈఆర్వో మనోరమ చెప్పారు. యలమంచిలి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 246 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఇటీవల ఓటరు జాబితా నవీకరణ తర్వాత మొత్తం ఓటర్లు సంఖ్య 2,02,732గా ఉంది.ప్రస్తుతం కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ జరుగుతోందని, అర్హులైన ఓటర్ల పేర్లను అనుబంధ జాబితాలో చేర్చుతామని ఈఆర్వో రాజకీయపార్టీల నాయకులకు తెలిపారు. పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనలో అన్ని పార్టీల నాయకులు సహకరించాలని,18 సంవత్సరాలు నిండిన అర్హులైన ఓటర్లుంటే వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేయించడానికి ఫారం-6 పూరించి ఆధారాలతో తహసీల్దారు కార్యాలయాల్లో నేరుగా దరఖాస్తులను ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓటర్లంతా జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో ఒకసారి సరిచూసుకునే విధంగా చైతన్యపర్చాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వర్రావు, బొద్దపు శ్రీను, సోమునాయుడు, ఆడారి రమణబాబు, మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి, యలమంచిలి మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ అధికారుల పర్యటన

మునగపాక : మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఐసీడీఎస్ ఉన్నతాధికారులు సందర్శించారు. కేంద్రాల తనిఖీల్లో భాగంగా మునగపాక బీసీ కాలనీలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి, సీడీపీవో ఇందిరలు పరిశీలించారు. కేంద్రం ద్వారా అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేంద్రానికి సంబంధించిన రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ప్రస్తుతం ఉన్న కేంద్రం శిథిలావస్థకు చేరుకున్నందున అందరికీ అనువుగా ఉండేలా అద్దెకు భవనం తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ హేమలతకు సూచించారు. సూపర్‌వైజర్ అన్నపూర్ణ వారి వెంట పాల్గొన్నారు.